

ఆస్‌బెస్టాస్‌కాలనీలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

సీసీ కెమెరాల ఏర్పాటుతో భద్రత

- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

వివేకానందనగర్‌కాలనీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో భద్రత పెరుగుతుందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. కూకట్‌పల్లి డివిజన్ ఆస్‌బెస్టాస్‌కాలనీలో రూ. 15 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అన్ని కాలనీల్లో అసోసియేషన్ల సహకారంతో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ఎస్‌ఐ సత్యం, మాజీ కార్పొరేటర్ రంగారావు, నాయకులు లక్ష్మీనారాయణ, నాగేశ్వర్‌రావు, అబ్దుల్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

వివేకానందనగర్‌కాలనీకి చెందిన వినాయక పార్కు యోగా గ్రూప్ సభ్యులు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రోజాదేవి, యోగా గ్రూప్ సభ్యులు సుదర్శన్‌రెడ్డి, రేణుక, విజయలక్ష్మి, టి.ఎల్.రాణి, మాధవి, రాధారాణి, హేమ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రకుంట చెరువును రక్షించాలి : బీజేపీ

నిజాంపేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎర్రకుంట చెరువును రక్షించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. చెరువును కబ్జా చేస్తున్నారని గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని బీజేపీ నిజాంపేట కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. ప్రగతినగర్ గ్రామ పరిధిలో చెరువు 2.33 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. చెరువును ఆక్రమించి చేసిన అక్రమ నిర్మాణాలను అధికారులు గతంలో కూల్చివేశారు. ఆరు నెలల నుంచి ఫెన్సింగ్‌ను తొలగించి బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌ను ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారు. వీటిపై ప్రజావాణిలో ఫిర్యాదు చేశామని సతీష్ తెలిపారు. చెరువును రక్షించకపోతే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. గురువారం చెరువు ప్రాంతాన్ని బీజేపీ కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి భిక్షపతి యాదవ్, సెక్రటరీ అరుణ్‌రావు, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రసాద్ రాజు, ప్రధాన కార్యదర్శి భూపాల్‌రెడ్డి, ట్రేడర్ సెల్ కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ముఖేష్ తదితరులు పరిశీలించారు.



ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందజేస్తున్న డిప్యూటీ మేయర్ ధన్‌రాజుయాదవ్

ఆలయ నిర్మాణానికి రూ. లక్ష విరాళం

నిజాంపేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మధురానగర్‌లోగల అష్టలక్ష్మి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి నిజాంపేట డిప్యూటీ మేయర్ ధన్‌రాజు యాదవ్ లక్షల రూపాయల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులు లింగయ్య, విష్ణు, రాంబాబుకు అందజేశారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు జగన్ యాదవ్, కుమార్‌రెడ్డి, దశరథ్, ఆనంద్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకుంటాం

- టౌన్‌ప్లానింగ్ డీసీపీ సుస్మిత

హైదర్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా నిర్మించిన అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకుంటామమని కూకట్‌పల్లి సర్కిల్ టౌన్‌ప్లానింగ్ డీసీపీ సుస్మిత అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ హెచ్‌ఎంటీ శాతవాహన కాలనీ, ప్లాట్ నెంబర్ 197లో బహుళ అంతస్థుల భవనం నిర్మించేందుకు సెల్లార్ తవ్వకాలు చేసి పిల్లర్లు వేస్తున్నారు. డీసీపీ ఆ ప్రాంతాన్ని గురువారం పరిశీలించి అనుమతి పత్రాలు పరిశీలించారు. సెల్లార్ పనులను సిబ్బందితో ఆపివేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా భవనాలు నిర్మిస్తే నిర్మాణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. టౌన్‌ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ సోమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీకి కొత్త ఇన్‌స్పెక్టర్లు



ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్

కూకట్‌పల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు ఇన్‌స్పెక్టర్‌గా డి.కృష్ణమోహన్‌ను నియమిస్తూ సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సురేందర్‌గౌడ్‌ను మేడ్చల్ జోన్ సీసీఎస్‌కు బదిలీ చేశారు. కృష్ణమోహన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.



ఇన్‌స్పెక్టర్ వెంకన్న

హైదర్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా సీహెచ్ వెంకన్నను నియమిస్తూ సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ భార్యాభర్తల వివాదంలో తలదూర్చి భర్తపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడంతో గతవారం సస్పెన్షన్ చేశారు. దీంతో సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వెంకన్నను కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు.

క్రీడాకారులకు అభినందన



ఆర్టీసీ క్రీడాకారులు మంజుల, శ్రీదేవి, సోమేష్‌కుమార్‌ను అభినందిస్తున్న డీఎం ఇసాక్‌బేగ్ అహ్మద్

ఫతేనగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలో జీఎంసీ బాలయోగి స్టేడియంలో గతనెల 30 నుంచి జరిగిన 10వ నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ స్టేట్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆర్టీసీ కూకట్‌పల్లి డిపో ఉద్యోగులు ప్రతిభ చాటారు. జావెలిన్ త్రో, షాట్‌పుట్, లాంగ్ జంప్‌లో మంజుల మూడు బంగారు పతకాలు, జావెలిన్ త్రో, ట్రిబుల్ జంప్, హామర్ త్రోలో శ్రీదేవి మూడు బంగారు పతకాలు, మరో ఉద్యోగి సోమేశ్‌కుమార్ 400 మీటర్ల పరుగులో గోల్డ్‌మెడల్, లాంగ్ జంప్‌లో బ్రాంజ్, ట్రిబుల్ జంప్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. ముగ్గురినీ కూకట్‌పల్లి డిపో డీఎం ఇసాక్ బేగ్ అహ్మద్, సీఐ శ్రీలత, తోటి ఉద్యోగులు అభినందించారు.



మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి మొక్క అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబీహా బేగం

బస్టాపులున్నా.. షెల్టర్లు లేవు

- రోడ్డుపైనే నిలబడుతున్న ప్రయాణికులు



బస్సు షెల్టర్ లేక రోడ్డుపైనే ప్రయాణికులు

షాపూర్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు రోడ్డుపైనే నిలబడాల్సి వస్తోంది. బాలానగర్, నర్సాపూర్ ప్రధాన రహదారిలో సూరారం, సాయిబాబా నగర్ చౌరస్తా వద్ద రోడ్డుకు ఇరుపక్కల బస్టాప్‌లు ఉన్నా షెల్టర్లు లేవు. అధికారులు ఉన్నవి తొలగించి కొత్తవి ఏర్పాటు చేయలేదు. ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తూ నిలబడాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోయారు. బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

చౌరస్తాల్లో ట్రాఫిక్ జామ్



పైప్‌లైన్ రోడ్డు చౌరస్తాలో నిలిచిపోయిన వాహనాలు

- ప్రయాణికులు, వాహనదారుల ఇబ్బంది
- సిగ్నల్స్ ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యం

గాజులరామారం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ప్రధాన రహదారుల్లో చౌరస్తాల్లో ట్రాఫిక్ జామ్‌తో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అయోధ్యనగర్, ప్రకాశం పంతులునగర్, శ్రీనివాసనగర్, గాజుల రామారం, పైప్‌లైన్ రోడ్డు చౌరస్తాల్లో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అర్హులకు గ్యారెంటీలు : జగదీశ్వర్‌గౌడ్



ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కాంగ్రెస్ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్

గచ్చిబౌలి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ కమ్యూనిటీ హాల్, అంజయ్యనగర్ వార్డు కార్యాలయం, మాదాపూర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసి ప్రజాపాలన కేంద్రాలను కాంగ్రెస్ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ గురువారం పరిశీలించారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రకటించిన గ్యారెంటీలు అర్హులకు అందజేస్తామన్నారు. డివిజన్ నాయకులు జంగంగౌడ్, నీలం లక్ష్మీనారాయణముదిరాజ్, కృష్ణగౌడ్, నందు, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ఫతేనగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అర్హులైన వారందరికీ అందజేస్తామని ఆ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. గురువారం బేగంపేట డివిజన్‌లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని సందర్శించారు. రమేష్, కొప్పిశెట్టి దినేశ్‌కుమార్, సతీష్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్: దిల్‌కుష్‌నగర్ కమ్యూనిటీ హాలులో ప్రజాపాలన కేంద్రాన్ని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి గురువారం సందర్శించారు. సెంటర్ ఇన్‌చార్జిని అడిగి వివరాలు తెలుసుకున్నారు.

కబ్జా చేస్తే సహించం



దరఖాస్తులను పరిశీలిస్తున్న బండి రమేష్

అల్లాపూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలో అందరికీ న్యాయం జరుగుతుందని ఆ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. గురువారం అల్లాపూర్ డివిజన్‌లో ఆయన పర్యటించారు. బేగంపేటలో కొంతమంది భూములు కబ్జా చేస్తున్నారని స్థానికులు తనకు ఫిర్యాదు చేశారన్నారు. కబ్జా చేసే వారు ఎంతటివారైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. ప్రజాపాలన కేంద్రాన్ని సందర్శించి దరఖాస్తులను పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బేగంపేట రమేష్, కొప్పిశెట్టి దినేష్‌కుమార్, సతీష్ రెడ్డి, విఠల్ రెడ్డి, నరసింహ, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మేనిఫెస్టోను కించపరుస్తూ వ్యాఖ్యలు

- ఓయూలో మాజీ మంత్రి కేటీఆర్ చిత్రపటం దహనం



ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో మాజీ మంత్రి కేటీఆర్ చిత్రపటాన్ని దహనం చేస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ తదితరులు

తార్నాక, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మేనిఫెస్టోను కించపరుస్తూ.. అది 420 అని మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆధ్వర్యంలో గురువారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో కేటీఆర్ చిత్రపటాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికాంలోకి వచ్చి నెల కూడా కాలేదని, పదేళ్లపాటు మంత్రిగా పనిచేసిన వ్యక్తి, అధికారం చేజారగానే మాజీ మంత్రి కేటీఆర్ ప్రభుత్వంపై విషం చిమ్మడం ఎంతవరకు సమంజసమని తీవ్రంగా మండిపడ్డారు. తెలంగాణ ప్రజలు పదేళ్లపాటు కేసీఆర్‌కు అధికారాన్ని అప్పగిస్తే తెలంగాణ సంపదను ఆయన కుటుంబం దోచుకుందని ఆరోపించారు. కేటీఆర్ తన వైఖరి మార్చుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లాలని కుట్రలు పన్నితే, తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఎన్ఎస్‌యూఐ ఓయూ ప్రెసిడెంట్ మేడ శ్రీను, మహేష్ గౌడ్, విజయ్, సుమన్, వీరేందర్, బాలకృష్ణ పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన మందులు స్వాధీనం

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): డ్రగ్ కంట్రోల్ అధికారులు చందానగర్‌లో లైఫ్ కేర్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌పై గురువారం దాడి చేసి అక్రమంగా నిల్వ ఉంచిన మందులను స్వాధీనం చేసుకున్నారు. యాంటీబయాటిక్, దగ్గు మందులు కూడా స్వాధీనం చేసుకున్నవాటిలో ఉన్నాయని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. వీటి విలువ రూ. 20 వేలు ఉంటుందన్నారు. మహ్మద్ అబ్దుల్ వాజీద్ అనే వ్యక్తి అర్హత లేకున్నా ఆర్‌ఎంపీగా ప్రచారం చేసుకుంటూ క్లినిక్ నడిపిస్తున్నట్లు తమ స్థానిక అధికారుల తనిఖీలో వెల్లడయ్యిందని డ్రగ్స్ కంట్రోల్ విభాగం డైరెక్టర్ జనరల్ వి.బి. కమలహాసన్‌రెడ్డి తెలిపారు.

నేరాల నియంత్రణకు ఆర్‌పీఎఫ్ కృషి

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): దక్షిణమధ్య రైల్వే రక్షణ దళం (ఆర్‌పీఎఫ్) నేరాల నియంత్రణకు నిరంతరం కృషి చేస్తూనే అక్రమార్కులను అరెస్టు చేసి ప్రయాణికుల్లో విశ్వసనీయత పెంచింది. రైళ్లు, రైల్వేస్టేషన్లలో నేర కార్యకలాపాలను విజయవంతంగా నియంత్రించినట్టు అధికారులు పేర్కొన్నారు. గత ఏడాది రైల్వే వస్తువులు అపహరించిన, ఆస్తులను ఆక్రమించిన 693 మందిని అరెస్టు చేసి రూ.1.97 కోట్ల రైల్వే ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. నడుస్తున్న రైళ్లపై రాళ్లు రువ్వినందుకు 401 కేసులు నమోదు చేసి 327 మందిని అరెస్టు చేశారు. 161 మందిని అరెస్టు చేసి 23.09 కోట్ల విలువైన 3,239 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రైల్వే రిజర్వేషన్ టికెట్లను అనధికారికంగా విక్రయించినందుకు 261 మందిని అరెస్టు చేసి రూ.2,30,59,680 విలువ చేసే 8770 టికెట్లను రైల్వే రక్షణ దళం స్వాధీనం చేసుకుంది. టికెట్ లేకుండా రిజర్వేషన్ బోగీలో ప్రయాణించిన 702 మంది నుంచి రూ. 1.47 లక్షల జరిమానా వసూలు చేసినట్టు తెలిపారు. ఫుట్‌బోర్డ్‌లపై ప్రయాణించినందుకు 627 మందిని పట్టుకున్నారు. టికెట్ లేకుండా ప్రయాణించిన 1903 మంది వద్ద రూ.1.36 లక్షల జరిమానా వసూలు చేశారు. రైళ్లలో పేలుడు పదార్థాలను తీసుకెళ్తున్న 19 మందిని అరెస్టు చేశారు. రైల్వే ప్రాంగణంలో ప్రయాణికుల వస్తువులను దొంగిలించిన 454 మందిని అరెస్టు చేసి 9.36 కోట్ల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

మియాపూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగను పురస్కరించుకుని కొమిరిశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరంభటౌన్‌షిప్, హఫీజ్‌పేట కమ్యూనిటీహాల్ వద్ద గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఫౌండేషన్ కన్వీనర్ రామస్వామియాదవ్ ముగ్గుల విశిష్టతను వివరించారు. న్యాయనిర్ణేత వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సారస్వత పరిషత్తు వచన కవిత అధ్యయన శిబిరం

గోషామహల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సారస్వత పరిషత్తు ఇటీవల నిర్వహించిన యువ రచయిత్రుల సమ్మేళనానికి కొనసాగింపుగా ఫిబ్రవరి 11న వచన కవిత్వంలో అధ్యయన శిబిరం నిర్వహిస్తున్నట్లు పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య తెలిపారు. పరిషత్తు ప్రాంగణంలో నిర్వహించే ఈ శిబిరంలో కవిత్వ భాషా శైలి, శీర్షిక, వస్తువు, శిల్పం, ఎత్తుగడ, నిర్వహణ ముగింపు మొదలైన అంశాలపై ప్రముఖ కవులు, విమర్శకులు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. యువ రచయిత్రుల సమ్మేళనంలో పాల్గొన్న వారిలో సుమారు 50 మందిని వారి కవితలను పరిశీలించి ఎంపిక చేశామని.. ఎవరైనా పాల్గొనాలనుకుంటే ఇటీవల రాసిన స్వీయ కవితను, ఇతర వివరాలతో దరఖాస్తు చేస్తే ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. దరఖాస్తులను 96037 27234 ఫోన్ నంబర్‌కు ఈనెల 12వ తేదీలోపు వాట్సాప్ చేయాలని కోరారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య

హైదర్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో విశ్రాంత ఉద్యోగి, మతిస్థిమితం సరిగా లేక విశ్రాంత సీఐ కుమారుడు, సోదరుడి వేధింపులు భరించలేక మరో వ్యక్తి బలవంతంగా ప్రాణాలు తీసుకున్నారు. కేపీహెచ్‌బీ 6వ ఫేజ్ సాయి సరస్వతి అపార్ట్‌మెంట్స్‌లో ఈడుపుగంటి చిన సాంబశివరావు(65) నివసిస్తున్నాడు. గతంలో ప్రైవేటు ఉద్యోగం చేసి రిటైర్ అయ్యాడు. కొంతకాలం కోల్‌కతాలో కుమార్తె వద్ద ఉన్నాడు. 20 రోజుల క్రితం నగరానికి వచ్చి కేపీహెచ్‌బీలో ఒంటరిగా ఉంటున్నాడు.

గురువారం మధ్యాహ్నం వరకు సాంబశివరావు తలుపులు తెరవకపోవడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి తలుపులు తెరిచి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొని వేలాడుతూ ఉన్నాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు అతడు రాసిన సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విశ్రాంత సీఐ కుమారుడు..

దుండిగల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. విశ్రాంత సీఐ మాథ్యూస్ కోషే కుమారుడు జియో మాథ్యూస్(38) చర్చి గాగిల్లాపూర్‌లో నివసిస్తున్నాడు. కొద్ది రోజుల నుంచి అతడికి మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఇంట్లో ఘర్షణ పడుతుండేవాడు. బుధవారం రాత్రి గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మతిస్థిమితి సరిగా లేక ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రి దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సోదరుడి వేధింపులు భరించలేక..

చందానగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సోదరుడికి వేధింపులు భరించలేక పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. తారానగర్ తుల్జా భవానీ టెంపుల్ వద్ద నివసిస్తున్న శరత్‌చారి(26)కి చందనశ్రీతో వివాహం అయింది. అతడికి ఉద్యోగం లేకపోవడంతో కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. పెళ్లికి తాను ఖర్చుపెట్టిన డబ్బు తిరిగి ఇవ్వాలని సోదరుడు శ్రీనివాస్, అతడి భార్య శరత్‌చారిని ఒత్తిడి చేసి కొట్టారు. దీంతో బంగారు ఆభరణాలు వారికి ఇచ్చాడు.

ఉద్యోగం లేకపోవడంతో శరత్‌చారి భార్యను వారి తల్లివద్ద ఉండాలని సూచించాడు. ఉద్యోగం వచ్చిన తర్వాత తీసుకెళ్తానని చెప్పాడు. పెళ్లికి ఖర్చుపెట్టిన డబ్బు ఇవ్వమని సోదరుడు వేధించడంతో మనస్తాపం చెందిన శరత్‌చారి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. చందనశ్రీ భర్తకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. భర్త సోదరికి ఫోన్ చేసి అడగగా తనకు తెలియదని చెప్పింది. గురువారం అర్ధరాత్రి మరిది ఫోన్ చేసి శరత్‌చారి ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పాడు. చందనశ్రీ వెంటనే భర్త ఉంటున్న ఇంటికి వెళ్లి చూడగా.. చనిపోయి ఉన్నాడు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

హైదర్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. కేపీహెచ్‌బీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట రంగారెడ్డినగర్‌కు చెందిన ఆదెపు శైలజ(34) కేపీహెచ్‌బీ కాలనీలో నెక్సస్ ఫోరం మాల్ సమీపంలోగల ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. గురువారం ఉదయం జగద్గిరిగుట్టలో ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై కార్యాలయానికి వెళ్తోంది. కేపీహెచ్‌బీ మెట్రోస్టేషన్ వద్దకు రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఆమెను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన శైలజను స్థానికంగాగల ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కిరాణా షాపునకు వెళ్లి వస్తుండగా..

హైదర్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోగల సీబీసీఐడీ అపార్ట్‌మెంట్‌లో సంగారెడ్డి జిల్లా అంతెర్‌గాన్ గ్రామానికి చెందిన భూతలి బాలరాజు(41) వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల ఒకటో తేదీ రాత్రి 10 గంటల సమయంలో కిరాణా షాపునకు వెళ్లాడు. తిరిగి వస్తూ హైదర్‌నగర్ పోచమ్మగుడి వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం అతడిని ఢీకొట్టింది. ప్రమాదానికి కారణమైన ద్విచక్రవాహనదారుడు బాలరాజు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి..

కూకట్‌పల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మూసాపేట ఆంజనేయనగర్‌లో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వయస్సు సుమారు 50 సంవత్సరాలు ఉంటాయన్నారు.

బాలకార్మికుడికి విముక్తి

రాయదుర్గం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బాలకార్మికుడికి అధికారులు విముక్తి కల్పించారు. గోపన్‌పల్లి ఎన్టీఆర్‌నగర్‌లో ఓ వెల్డింగ్ షాపులో బాలుడు పనిచేస్తుండడంతో స్థానికులు చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. సంగారెడ్డిజిల్లాకు చెందిన చైల్డ్‌ప్రొటెక్షన్ అధికారి సరస్వతి, అధికారులు వెల్డింగ్ షాపులో పనిచేస్తున్న బాలుడికి విముక్తి కల్పించారు. బాలుడితో పనిచేయిస్తున్న యజమాని అమ్జద్‌పై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రజా రవాణా వ్యవస్థ బలపడింది

- మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆర్టీసీ ప్రాధాన్యం పెరిగింది
- ప్రొఫెసర్ ఎం.కోదండరాం

రాంనగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా రవాణా వ్యవస్థ బలపడిందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆర్టీసీ ప్రాధాన్యం పెరిగిందని ప్రొఫెసర్ ఎం.కోదండరాం అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దెబ్బతిన్న ఆర్టీసీని అభివృద్ధి చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి కార్యాచరణ ప్రణాళిక చేపట్టబోతున్నారని తెలిపారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని వీఎస్టీ ఫంక్షన్ హాల్‌లో ఐఎన్‌టీయూసీ అనుబంధ సంస్థ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సికింద్రాబాద్, హైదరాబాద్ రీజియన్ల సమావేశం జరిగింది. కోదండరాం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్టీసీ స్టాఫ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మహమూద్, వైస్ చైర్మన్ జక్కుల మల్లేశం, అదనపు ప్రధాన కార్యదర్శి అబ్రహాం మాట్లాడారు. ఆర్టీసీలో వెల్ఫేర్ కమిటీలను రద్దుచేసి యూనియన్‌లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు చెల్లించాలని, వేతన సవరణ చేయాలని, ట్రెజరీ ద్వారా జీతాలు చెల్లించాలని, కొత్త నియామకాలు చేపట్టాలని కోరారు. కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, సీసీఎస్ బకాయిలు చెల్లించాలని, కార్మికులకు పీఎఫ్ డబ్బులు ఇవ్వాలని, ఉచిత బస్సు ప్రయాణం వల్ల జరుగుతున్న నష్టాన్ని ప్రభుత్వం ప్రతి నెలా చెల్లించాలని, వనభోజనాలు రద్దు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.



అభివాదం చేస్తున్న ప్రొఫెసర్ ఎం.కోదండరాం, రాజిరెడ్డి, మహమూద్, కోట నీలిమ తదితరులు

నూతన సంవత్సరం సందర్భంగా నల్లగొండ, సూర్యాపేటలో సీఎం, మంత్రులకు శుభాకాంక్షలు తెలుపుతూ పెట్టిన ఫ్లెక్సీలను తొలగించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. నాయకులు జి.సత్యనారాయణరెడ్డి, ఆర్.డి.చంద్రశేఖర్, నాగన్నగౌడ్, తిరుమలేష్, జె.గోపాల్, అఫ్జల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయం కావాలి

చార్మినార్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణే అందరి ధ్యేయం కావాలని ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. సిటీ కాలేజ్‌లో జరిగిన రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. నాగరిక జీవితం గడపాలంటే తప్పనిసరిగా రాజ్యాంగ సూత్రాలను పాటించాలన్నారు. రాజ్యాంగాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తేనే ఆర్థికాభివృద్ధి జరుగుతుందని తెలిపారు. సదస్సుకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ బాల భాస్కర్ మాట్లాడుతూ.. రాజ్యాంగంపట్ల, రాజ్యాంగంలోని కీలకమైన సాంకేతిక పదాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలనే సంకల్పంతో ఈ సదస్సు నిర్వహించామన్నారు. ప్రొఫెసర్ డా.కె.భాస్కర్ సమన్వయకర్తగా వ్యవహరించిన సదస్సులో తెలుగు రాష్ట్రాలకు చెందిన అధ్యాపకులకు ప్రొఫెసర్ కోదండరాం ధ్రువపత్రాలు అందజేశారు. ఉపసంచాలకులు డా.షహజాద్, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.